జార్జి రెడ్డి జీవన రేఖలు

# జీనా హైతో మర్నా సీఖో



కాత్యాయని

# జీనా హైతో మర్‌నా సీఖో
# కదమ్ కదమ్ పర్ లడ్‌నా సీఖో

## జార్జిరెడ్డి జీవన రేఖలు

కాత్యాయని

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : 60/-

మొదటి ముద్రణ : జనవరి 2016

కవర్ ఫోటో : Crisis in the Campus, documentary by Fali Billimoria, 1971, అక్షరాలు సృజన్

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్ - 500 006 ఫోన్ : 23521849,
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్,
గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364

# ఈ పుస్తకాన్ని గురించి

జీనా హైతో మర్‌నా సీఖో
కదమ్ కదమ్ పర్ లడ్‌నా సీఖో

– జార్జి రెడ్డి పోరాటస్ఫూర్తికి ప్రతిరూపమైన నినాదమిది. అతడు జీవించినది పాతికేళ్ళే. కానీ, నిండైన వ్యక్తిత్వంతో జీవించటం ఎలాగో, జీవితాన్నొక ఆధిపత్య వ్యతిరేక పోరాటంగా మలచుకోవటం ఎలాగో, ఒక నమూనాను నెలకొల్పి వెళ్ళాడు జార్జి.

అతడి జీవితం నిజంగా అడుగడుగునా పోరాటంగానే సాగింది. తన వ్యక్తిగత, సామాజిక జీవితాల్లో ఎదురయిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ జార్జి సాగించిన ప్రయాణం అతడినొక విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది.

ప్రపంచవ్యాప్తంగా యువతరాన్ని ఉరకలెత్తించిన అరవయ్యవ దశాబ్దపు విప్లవ చైతన్యానికి స్పందించిన జార్జి, ఆ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించేందుకు పూనుకున్నాడు.

ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా జార్జి, అతడి సహచరులు సాగించిన పోరాటం తెలుగు నేలపై విప్లవ ప్రజాస్వామిక విద్యార్థి ఉద్యమాల చరిత్రలోనే ఒక విశిష్టమైన అధ్యాయాన్ని రచించింది. భారతదేశంలోనూ, రాష్ట్రంలోనూ బలపడుతున్న విప్లవోద్యమ చైతన్యాన్ని విద్యార్థి ఉద్యమంలో ప్రవేశపెట్టేందుకు జార్జి విలువైన కృషి చేశాడు. ఆనాటి విద్యా సంస్థలపై పెత్తనం సాగిస్తుండిన అభివృద్ధి నిరోధక శక్తులపై అతడి సహచర బృందం పోరాటానికి సిద్ధపడింది. విద్యారంగ సమస్యలను సామాజిక సమస్యలతో అనుసంధానం చేసిన ఈ విద్యార్థి సంఘం సామాజిక మార్పులో విద్యార్థులు నిర్వహించాల్సిన పాత్రను స్పష్టంగా నిర్వచించింది.

అన్ని రకాల ఆధిపత్య వ్యవస్థలకూ ఎదురు నిలిచి పోరాడే క్రమంలో జార్జి నెలకొల్పిన విలువలు అతణ్ణి యువతరానికి సన్నిహితం చేశాయి. ఫ్యూడల్ పెత్తందారీ శక్తులకు ఎదురు నిలవాల్సిన ఉద్యమం ఎంత ప్రజాస్వామికంగా, పారదర్శకంగా, నిర్భయంగా సాగాలో అతడు ఆచరించి చూపాడు. అందుకు తన ప్రాణాలనే పణం పెట్టాడు.

జార్జి హత్యతో యువతరంలో రేగిన ఆగ్రహం, అలజడి బలమైన విద్యార్థి ఉద్యమానికి ప్రేరణగా నిలిచాయి. సంస్థాగతంగా ఎన్ని పాయలుగా ప్రవహించినా, వ్యవస్థను సమూలంగా మార్చాలనే విప్లవ చైతన్యం ఈ ఉద్యమాలన్నిటికీ స్ఫూర్తిగా నిలిచింది.

జార్జి మరణానంతరం ఉస్మానియా యూనివర్సిటీ నుండి తయారైన ఎందరో విప్లవ విద్యార్థులు భారత విప్లవోద్యమానికే నాయకులుగా ఎదిగారు.

ఇన్ని ఉద్యమాలు వికసించిన అనంతరం, ఇవాళ మళ్ళీ సమాజంపై మతోన్మాద రాజకీయాల పట్టు బిగుస్తున్నది. హేతువాద, ప్రజాస్వామిక శక్తులపై పెరుగుతూ వచ్చిన అసహనం భౌతిక దాడులుగా, హత్యలుగా పరిణమిస్తున్నది. ఈ పరిస్థితికి కారణాలను లోతుగా అన్వేషించాల్సి ఉన్నది. ప్రజాజీవనంలో మతానికున్న పాత్రనూ, మతోన్మాద రాజకీయాల పట్ల నిర్లిప్తంగా ఉండిపోయే వైఖరినీ విశ్లేషిస్తూ ప్రత్యామ్నాయ దృక్పథాన్ని నిర్మించాల్సి ఉన్నది. మతోన్మాద శక్తులపై జార్జి చేసిన పోరాటాన్ని తెలిపే ఈ పుస్తకం అందుకు సహకరించగలదని మా ఆశ.

భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తున్న ఆధిపత్య శక్తులపై నిరసన స్వరాలను విన్పిస్తున్న ప్రజాస్వామిక వాదులతో గొంతు కలుపుతూ ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాం.

**హెచ్‌బిటి**

# కొన్ని ప్రశ్నలతో... మరికొన్ని సందేహాలతో...

జార్జిరెడ్డి హత్యకు గురయ్యేనాటికి నేను స్కూలు విద్యార్థిని. హైదరాబాద్‌కు దూరంగా ఒక పల్లెటూళ్ళో పుట్టి పెరిగినదాన్ని. అందువల్ల ఆయన గురించి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం నాకేమాత్రమూ లేదు. ఆ తరువాత, విద్యార్థుల ఉద్యమాల గురించి తెలుసుకుంటూ ఉన్నప్పుడు, ముఖ్యంగా హైదరాబాద్‌లో నివసించటం మొదలయ్యాక, జార్జికి సంబంధించిన అనేక విషయాలు విన్నాను.

జార్జిరెడ్డితో కలిసి పనిచేసిన కొందరు సహచరుల జ్ఞాపకాలను వినటం ఉత్తేజకరమైన అనుభవం. విప్లవోద్యమ భావజాలం ప్రాతిపదికగా ఒక విద్యార్థి సంఘాన్ని తొలిసారిగా నిర్మించటానికి పాతికేళ్ళయినా లేని ఆ యువకుడు చేసిన ప్రయత్నమూ, తనను తాను రూపొందించుకున్న తీరూ... అద్భుతంగానూ, ఆసక్తికరంగానూ తోచాయి. ఆ విషయాలన్నిటినీ ఒకచోట చేర్చగలిగితే బావుండునన్పించింది. అలా మొదలయిన ప్రయత్నమే ఈ పుస్తకం. హెచ్‌బిటి గీత అందించిన సహకారం లేకపోతే నాకిది సాధ్యమయ్యేది కాదు. జార్జి కుటుంబ సభ్యులను, సహచరులను సంప్రదించి వాళ్ళ జ్ఞాపకాలను సేకరించే పూర్తి బాధ్యతను తీసుకున్నారామె.

జార్జితో కలిసి తాము నిర్మించిన ఉద్యమ చరిత్రలోకి తమ స్మృతుల ద్వారా తిరిగి ప్రవేశిస్తూ, ఆనాటి తమ ఉత్తేజంతో పునర్జీవిస్తూ... ఎంతో ఉద్వేగంతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు ఆయన సహచరులు. ఆ ఉద్యమానుభవాలకు నిర్దిష్టమైన స్థల కాలాలున్నాయి. వారి అనుభవాలను వింటున్న నావంటి శ్రోతలం కూడా ప్రత్యేకమైన స్థల, కాలాల అవధులకు లోబడినవాళ్ళమే. అందువల్ల జార్జి సాగించిన మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని, ఈనాటి మతతత్వ రాజకీయ సందర్భంతో పోల్చి చూడటం తప్పనిసరి అవుతున్నది. ఆయన అందించిన ఫ్యూడల్ వ్యతిరేక చైతన్యం వర్తమానంలోకి ప్రవహించాల్సిన జాడల కోసం వెదుక్కోవటమూ అనివార్యమే అవుతున్నది. సరిగ్గా ఇక్కడే... ఎన్నో ప్రశ్నలు చుట్టుముట్టాయి. వాటిని పట్టించుకోకుండా జార్జి జీవితగాథను రాసుకుంటూ పోవటం నాకు సాధ్యపడలేదు. అందుకే, కావలసిన సమాచారమంతా సిద్ధంగా ఉన్నా, ఈ చిన్న పుస్తకానికి ఒక రూపాన్నివ్వటం నాకు పెద్ద సమస్యగా మారింది.

జార్జికి ఒక స్పష్టమైన విప్లవ రాజకీయ దృక్పథం ఉండిందనీ, విప్లవోద్యమంలో పూర్తికాలం పని చెయ్యాలని నిర్ణయించుకున్నాడనీ ఆయన సహచరులందరూ చెప్పారు. ఫ్యూడలిజంపై పోరాటాన్ని తన వ్యూహాత్మక కర్తవ్యాల్లో భాగంగా ప్రకటించుకున్న భారత

విప్లవోద్యమ అవగాహనను అంగీకరించడం వల్లనే జార్జి తన తక్షణ పోరాటాన్ని క్యాంపస్‌లోని మతతత్వ శక్తులపై ఎక్కుపెట్టాడని కూడా వారు చెప్పారు.

ఐతే, జార్జి హత్య జరిగిన నలభైమూడేళ్ళ తర్వాత, సకల సామాజిక రంగాలనూ మతోన్మాద రాజకీయాల పడగనీడ కబళిస్తున్న ప్రస్తుత సందర్భంలో ఆ రాజకీయాలపై విప్లవోద్యమ సంస్థలన్నిటికీ అంత స్పష్టమైన అవగాహనే ఉన్నదా? తెలుగు నేలమీదనైతే దీనికి గట్టి జవాబులేదు. తెలంగాణ రాష్ట్రాన్ని (కేవలం భౌగోళికంగా) సాధించటం కొరకు కేంద్రంలో బిజెపిని అధికారంలోకి తెస్తామంటూ ఒక మే దినోత్సవం నాడు ఢిల్లీ నుండి ప్రకటన చేసిన సంస్థలో జార్జి సహచరులు కొందరూ, ఆయన వారసత్వాన్ని ప్రకటించు కుంటున్న విప్లవ సంస్థలూ కూడా భాగంగా ఉన్నాయి. హిందూత్వ రాజకీయాలపై నిశిత విమర్శలు చేసే కొందరు మేధావులూ ఉన్నారు. మతతత్వంతో సంబంధాలనేవి వీరికి ఇప్పుడిక కేవలం ఎత్తుగడల సమస్యలు మాత్రమేనని చెప్పటానికి ఇంతకన్నా సాక్ష్యాలెందుకు?

మన జీవితాల్లో మతం జోక్యం ఎంతగా బలపడిందో చెప్పటానికి సామాన్య ప్రజల విశ్వాసాలనూ, ప్రభుత్వాలు నిర్వహించే క్రతువులనూ విమర్శిస్తే చాలదు – మత ప్రతీకల సాయంతో తప్ప ప్రజల్ని సమీకరించలేమని నమ్ముతున్న ప్రజా కళాకారుల, అనేక విప్లవ ప్రజా సంఘాల భావదారిద్ర్యాన్ని గురించి కూడా మాట్లాడుకోక తప్పదు కదా! ఇంత బలహీనమైన గొంతుకలతో పాలక వర్గాల మతోన్మాదంపై యుద్ధారావాలు చెయ్యబోవటం ఎంత హాస్యాస్పదం!

ఇటువంటి పరిణామాల నడుమ నిలబడి, జార్జి పోరాటాన్ని గురించీ, ప్రాణాలను తృణప్రాయంగా ఒడ్డిన అతడి తెగువ గురించీ రాయబోవటం నాకొక బాధాకరమైన అనుభవంగా మారింది. నెలల తరబడి పక్కన పెట్టేస్తూ ఈ కాసిని పేజీలూ రాయటానికి రెండేళ్ళు పట్టింది. కలతపెట్టే ప్రశ్నలూ, సందేహాల నడుమన సాగిన ప్రయత్నమిది. జార్జి ఉద్యమ సహచరులెవరయినా స్వీయ విమర్శకు సిద్ధపడతారేమోనన్న ఒక దురాశ కూడా చాలాకాలం నన్ను పీడించింది.

జార్జి రెడ్డి జీవించినంత కాలమూ వ్యవస్థీకృతమయిన అన్ని విలువలనూ ప్రశ్నిస్తూనే ఉన్నాడు. ఆయన జీవితాన్ని మళ్ళీ ఒకసారి గుర్తుచేసే ఈ చిన్న పుస్తకం మరికొన్ని ప్రశ్నలయినా రేకెత్తించగలిగితే, అంతకన్నా కావలసిందేముంటుంది?

– **కాత్యాయని**

**1972,** ఏప్రిల్ 14వ తేది. సాయంత్రం నాలుగు కావొస్తోంది.

హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణ విద్యార్థులతో సందడిగా ఉంది.

యూనివర్సిటీ లైబ్రరీలోంచి పాతికేళ్ళ ఓ యువకుడు వెలుపలికొచ్చాడు. ఐదున్నరడుగుల ఎత్తు, తెల్లని దృఢమైన శరీరం, చురుకైన కళ్ళు... నల్ల చారలున్న గోధుమరంగు షర్టూ, బ్లూ కలర్ జీన్స్, నడుముకు వెడల్పాటి బెల్ట్ ధరించాడు. కాళ్ళకు హవాయి స్లిప్పర్లు. పేరు జార్జిరెడ్డి. ఫిజిక్స్ డిపార్టుమెంట్‌లో పరిశోధక విద్యార్థి.

దారిలో ఎదురయిన వాళ్ళను పలకరిస్తూ, లా కాలేజి మీదుగా జియోఫిజిక్స్ డిపార్టుమెంట్ వైపుగా నడుస్తున్న జార్జ్, మిత్రుడు శ్రీధరమూర్తి పిలుపుతో ఆగాడు. అతడూ, మరి కొంతమంది విద్యార్థులూ కలిసి బాడ్మింటన్ ఆడుతున్నారు.

"హలో జార్జ్, ఆడుతావా కాస్సేపు?"

"లేదులే, ఇంజనీరింగ్ కాలేజికెళ్తున్నా, ఎలక్షన్లు రేపే గదా, పనులెంతదాకా వచ్చాయో చూడాలి. హాస్టల్స్‌లో ధూల్‌పేట నించి మనుషుల్ని దించేశారు."

"మరి, ఒక్కడివే పోవటమెందుకు?"

"అంతమంది పోలీసులున్నారు, ఏం కాదులే!" ముందుకు నడుస్తూనే శ్రీధరమూర్తికి జవాబిచ్చాడు జార్జ్.

యూనివర్సిటీ వాతావరణం పైకి మామూలుగానే కనబడుతున్నా, లోలోపల గూడుకట్టుకుంటున్న ఉద్రిక్తత విద్యార్థులందరికీ తెలుస్తూనే ఉంది. అది ఏ క్షణాన ఏ రూపంలో బద్దలవుతుందోనన్న ఆందోళన వాళ్ళను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

అది హఠాత్తుగా ముంచుకొచ్చినదేమీ కాదు. రెండు విద్యార్థి బృందాల నడుమ రెండుమూడేళ్ళుగా ప్రారంభమైన వివాదాలు గత ఏడాది జరిగిన విద్యార్థి సంఘాల ఎలక్షన్ల నాటికి గాలివానగా మారాయి. ఇక, ఇప్పుడు రాబోతున్న తుపాను ఎంత ఉధృతంగా ఉండబోతుందో ఎవరి అంచనాలకూ అందటం లేదు.

ఉస్మానియా యూనివర్సిటీలోని విద్యార్థి సమూహాన్ని పరస్పర విరుద్ధమైన రెండు రకాల రాజకీయ భావజాలాలు ప్రభావితం చెయ్యసాగాయి. భావజాలపరమైన ఈ వైరుధ్యం

విద్యార్థులను ప్రధానంగా రెండు బృందాలుగా సమీకరించింది. వీటిలో ఒకటి, జనసంఘ్ (ఈనాటి భారతీయ జనతా పార్టీకి పూర్వరూపం) పార్టీకి చెందిన విద్యార్థి విభాగం, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) కింద సంఘటితమయింది. మరొక బృందం, జార్జి రెడ్డి నాయకత్వంలోని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ (పిడిఎస్) పేరిట ఏర్పడింది. వామపక్ష రాజకీయాలలోని వివిధ పోరాట పంథాలను సమర్థించే విద్యార్థులకు పిడిఎస్ ఒక వేదికయింది.

రెండు బృందాల నడుమ పెరుగుతూ వచ్చిన వైరుధ్యం, భావజాల పరమైన వివాదాల నుండి, భౌతిక దాడుల వరకూ అనేక రూపాల్లో వ్యక్తమవసాగింది. 1971 లో జరిగిన విద్యార్థి సంఘాల ఎన్నికల్లో జార్జి రెడ్డి బృందం విజయం సాధించటంతో అవతలి పక్షానికి అహం దెబ్బతిన్నట్లయింది. దీని ఫలితంగా క్యాంపస్ వాతావరణం కల్లోలితమయింది. కొట్లాటలూ, బంద్‌లూ, ధర్నాలూ నిత్యకృత్యాలుగా మారాయి.

ఈ పరిస్థితులు కొనసాగుతూ ఉండగానే ఏడాది గడిచి, మళ్ళీ ఎన్నికలొచ్చాయి. ఏప్రిల్ 15వ తేదీ జరగబోతున్న ఇంజనీరింగ్ కాలేజి ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించడంలో జార్జి తలమునకలుగా ఉన్నాడు. అతని తమ్ముడు సిరిల్ రెడ్డితోబాటు, మరికొందరు సన్నిహిత మిత్రులు కూడా ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులే.

యూనివర్సిటీ ఎన్నికలు పరోక్ష ఎన్నిక విధానంలో జరిగేవి. ముందుగా ప్రతి కాలేజిలోనూ విద్యార్థులందరూ కలిసి తమ రిప్రజెంటేటివ్‌ను ఎన్నుకుంటారు. రెండవ దశలో ఈ ప్రతినిధులందరూ కలిసి ఎగ్జిక్యూటివ్ పదవులకు ప్రతినిధులను ఎన్నుకుంటారు.

ప్రస్తుతం జరగబోతున్న ఇంజనీరింగ్ కాలేజీ ఎన్నికల్లో పిడిఎస్ ప్రతిపాదించిన అభ్యర్థికి పోటీగా లఖన్ సింగ్ అనే విద్యార్థిని నిలబెట్టింది ఎబివిపి. ఎంత విధ్వంసానికైనా తెగించి లఖన్ సింగ్‌ను గెలిపించేందుకు గూండాలను రంగంలోకి దించారని క్యాంపస్‌లో బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. తొలి హెచ్చరికగా ఫిబ్రవరి 24వ తేదీ రాత్రి జార్జి రెడ్డిపై దాడి చెయ్యటమూ, అతడు కొద్దిలో మృత్యువునుండి బయటపడటమూ కూడా జరిగింది.

ఇంత ఉద్రిక్తత నడుమ ఏమీ పట్టనట్టుగా నిర్భయంగా తిరిగే జార్జిని చూస్తుంటే మిత్రులకు ఆందోళనగా ఉంది. ఇంజనీరింగ్ కాలేజి హాస్టల్ నెం. 1 లో కిరాయి గూండాలు మకాం వేశారనీ, క్యాంపస్‌లో దాడులు జరిగే ప్రమాదం ఉన్నదనీ చెప్తూ 1972, ఏప్రిల్ 14వ తేదీ ఉదయాన్నే యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశాడు జార్జి రెడ్డి తమ్ముడు సిరిల్ రెడ్డి. వెంటనే ఇంజనీరింగ్ కాలేజి దగ్గరా, హాస్టలు గేటు ఎదుటా సాయుధ పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు కూడా.

పరిసరాలను గమనిస్తూ ముందుకు నడుస్తున్న జార్జ్, దయాసేర్ క్యాంటీన్ దగ్గర ఆగాడు. విద్యార్థి బృందాల సమావేశాలకు ముఖ్యమైన కేంద్రంగా ఉండేది ఈ క్యాంటీన్.

వాళ్ళ నడుమ కొత్త కొత్త స్నేహాలు ఏర్పడటమూ, వాదవివాదాలు ముదిరి ఘర్షణలుగా మారటమూ, తగాదాలు పరిష్కారమవటమూ... అన్ని రకాల సన్నివేశాలకూ ప్రత్యక్షసాక్షి దయాసేర్ నడిపే ఈ క్యాంటీన్.

క్యాంటీన్‌లో కూర్చునున్న ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు సాయిలు, జావీద్ మీర్జా, జార్జిని పలకరించారు. సిరిల్ కాస్సేపట్లో ఇక్కడికే వస్తున్నాడని వాళ్ళు చెప్పటంతో జార్జి వాళ్ళతోబాటు కూర్చున్నాడు.

ఇంతలో ఓ స్కూటర్ వేగంగా వచ్చి వాళ్ళ పక్కనే ఆగింది. రమేష్ చంద్రారెడ్డి, గోపీనాథ్ అనే విద్యార్థులిద్దరూ కంగారుగా స్కూటర్‌మీంచి దిగారు. రమేష్‌చంద్ర, జార్జిని పక్కకు పిలిచి ఏదో మాట్లాడుతున్నాడు. అతడు గత ఏడాది పిడిఎస్ తరఫున జనరల్ సెక్రటరీగా ఎన్నికైన వ్యక్తి. గోపీనాథ్ ఈ ఏడాది క్లాస్ రెప్రజెంటేటివ్‌గా పోటీకి దిగుతున్నాడు.

రమేష్ చంద్ర మాటలు వింటుండగానే జార్జి ముఖం గంభీరంగా మారిపోయింది. 'ఐదునిమిషాల్లో వచ్చేస్తా'నని సాయిలుకూ, జావేద్‌కూ చెప్తూనే స్కూటర్ ఎక్కేశాడు. వాళ్ళిద్దరూ తేరుకుని మాట్లాడబోయేంతలోనే స్కూటర్ వేగంగా ముందుకు దూకింది. రమేష్ నడుపుతూ ఉండగా గోపీనాథ్ మధ్యలోనూ, జార్జి వెనకసీట్లోనూ కూర్చుని ఉన్నారు.

ఇంజనీరింగ్ కాలేజి హాస్టల్ నెం.1 దగ్గరకు రాగానే స్కూటర్‌మీంచి దిగేసిన జార్జి, హాస్టల్ మెట్లమీదికి పరిగెత్తాడు. త్వరగా హాస్టల్లోకి వెళ్ళాలన్న ఆత్రుతే తప్ప, పరిసరాలను గమనించే ధ్యాసలో లేడతడు.

అలా నాలుగైదు మెట్లు ఎక్కేసరికి, అతడికి వెనకవైపున్న గదుల్లోంచి హఠాత్తుగా దూసుకొచ్చిన కొందరు మనుషులు జార్జిని చుట్టుముట్టారు. జరిగినదేమిటో గ్రహించేలోగానే వాళ్ళతడిచుట్టూ వలయంగా కమ్ముకున్నారు.

జార్జిమీద భౌతిక దాడులు జరగటం కొత్తేమీ కాదు. వాటిని ఎదుర్కోటానికి శారీరకం గానూ, మానసికంగానూ అతడెప్పుడూ సిద్ధంగానే ఉండేవాడు. కఠినమైన వ్యాయామంతో దృఢంగా తయారైన శరీరం, ప్యాంట్ జేబుల్లో పదునైన కత్తీ, నకుల్ డస్టరూ... ఏ క్షణంలోనైనా పోరాటానికి సిద్ధమేనన్నంత ఆత్మవిశ్వాసంతో ఉంటాడు జార్జి.

కానీ, ఇప్పటి పరిస్థితి వేరు. ఏ రకమైన ప్రతిఘటనకూ అవకాశమే లేనంత పకడ్బందీగా వెనకనుండి వాళ్ళతన్ని చుట్టుముట్టారు. ఐనా, తేరుకుని పోరాటానికి సిద్ధపడ్డాడు జార్జ్. గట్టిగా కేకపెట్టి వాళ్ళతో కలబడ్డాడు. వెనకనుండి బలంగా దూసుకొచ్చిన కత్తివేటు, అతడి నడుము కింది భాగం గుండా చొచ్చుకుపోయింది. పొత్తి కడుపులోకి దూసుకుపోతూ మరొకవేటు. ఊపిరి తిప్పుకోలేనంత వేగంగా, ఒకటి వెంట మరొకటిగా... శరీరాన్ని ఛిద్రం చేస్తూ అతడి ఒళ్ళంతా దిగుతున్న బాకులు. నెత్తుటి ముద్దగా మారిన శరీరంతో హాస్టల్ మెట్లపై కుప్పకూలి పోయాడు జార్జ్.

'చల్, బే! భాగ్ ! జల్దీ భాగ్!'

ఆ కేక వినగానే హంతకులందరూ పరిగెత్తుకువెళ్ళి హాస్టల్ ముందు నిలిచి ఉన్న కారులో ఎక్కేశారు. మరుక్షణంలో వాహనం ముందుకు దూసుకుపోయింది. వాళ్ళకు ఆ హెచ్చరిక చేసిన గొంతు, హాస్టల్ చుట్టూ కాపలా కాస్తున్న రక్షకభటుల్లో ఒకరిదని గుర్తించగానే అంతదాకా తెరుచుకుని ఉన్న హాస్టల్ గదుల కిటికీలు చటుక్కున మూతపడ్డాయి. ఆ కిటికీల వెనక కొందరు విద్యార్థులు నివ్వెరపోయి చూస్తుండగానే బహిరంగంగా, నిర్భయంగా జరిగిపోయిన హత్యాకాండ ఇది. హాస్టలు ఆవరణలో విశ్రాంతిగా కూర్చుని బీడీలు కాల్చుకుంటూ దీన్ని కళ్ళారా చూసిన పోలీసుల వైఖరికి ఆ విద్యార్థులు ఆశ్చర్యంతో, భయంతో అవాక్కయ్యారు. సాయుధులైన హంతకులు జార్జిని చుట్టుముట్టిన మరుక్షణమే రమేష్ చంద్రారెడ్డి, గోపీనాథ్ స్కూటర్‌పై పారిపోవటాన్నీ వాళ్ళు చూశారు... బహుశా జార్జ్ కూడా చూసే ఉంటాడు!

దయాసేర్ క్యాంటీన్ దగ్గరే కూర్చుని జార్జి రాకకోసం ఎదురు చూస్తున్నారు సాయిలు, జావేద్. జార్జి చెప్పివెళ్ళిన ఐదు నిమిషాలు ఇంకా పూర్తవనే లేదు – అతణ్ణి తీసుకువెళ్ళిన స్కూటర్ వేగంగా వచ్చి క్యాంటీన్ ముందు ఆగింది.

"జార్జి మీద అటాక్ చేశారు... కత్తుల్తో పొడిచేశారు" అని చెప్తూనే ఆర్ట్సుకాలేజి వైపుగా దూసుకుపోయారు రమేష్, గోపీనాథ్.

నివ్వెరపోయిన సాయిలు, జావేద్, మరుక్షణంలో ఇంజినీరింగ్ హాస్టల్‌వైపు పరుగు తీశారు. హాస్టల్ మెట్లపై నెత్తుటి ముద్దలా జార్జ్! అతని శరీరం నుండి ఇంకా స్రవిస్తున్న రక్తం మెట్లపై ధారలు కడుతోంది. కాపలా విధులకోసం వచ్చిన సాయుధ పోలీసులు హాస్టల్ ఆవరణంతటా ఇంకా అలాగే ఉన్నారు. వాళ్ళ ముఖాలు చూసిన జావేద్‌కు అర్థమైంది జార్జ్‌పై జరిగిన దాడిని అడ్డుకునేందుకు వాళ్ళేలాంటి ప్రయత్నమూ చెయ్యలేదనీ, ఇప్పుడిక వాళ్ళనుంచి ఏ సహకారాన్నీ ఆశించలేమనీ. అతడు వెంటనే, వైస్ – చాన్సలర్ ఆఫీసు వైపుకు పరుగుతీశాడు.

అప్పటికే ఈ వార్త క్యాంపస్‌కంతటికీ వ్యాపించింది. జార్జ్ మిత్రులు శ్రవణ్, కిషన్ లాబొరేటరీలోంచి నేరుగా రోడ్డుమీదికి పరిగెత్తుకెళ్ళి ఓ కారును ఆపి, హాస్టల్‌కు తీసుకొచ్చారు. జార్జిని కారులోకి చేర్చుతుండగా సిరిల్ పరిగెత్తుకొచ్చి వాళ్ళతో కలిశాడు. కారు గాంధీ హాస్పిటల్‌కు బయల్దేరింది. రక్తసిక్తమైన జార్జ్ శరీరాన్ని తడిమి చూస్తున్నారు. ఆ దేహం వెచ్చగా వాళ్ళ చేతులకు తగుల్తోంది. అతడింకా బతికే ఉన్నాడనీ, గతంలో ఎన్నోసార్లు జరిగినట్టే మళ్ళీ కోలుకుంటాడనీ వాళ్ళకు ఆశగా ఉంది. నిలువెల్లా గాయాలతో నిశ్చలమైన అతణ్ణి చూస్తుంటే వాళ్ళ ఆశ సన్నగిల్లుతూనూ ఉంది.

క్యాంపస్‌లో ఇంత ఉద్రిక్తమైన పరిస్థితులుండగా జార్జ్ ఒంటరిగా ఎందుకు వెళ్ళాడు? ఒంటరిగా పదిమందినైనా నిలువరించగల శక్తీ, చురుకుదనం, పోరాట మెలకువలూగల జార్జ్, ఇంత సులభంగా ప్రత్యర్థులకు ఎలా దొరికిపోయాడు? అసలీదాడి ఎలా జరిగింది?

వాళ్ళు ముగ్గురిలోనూ అంతులేనన్ని ప్రశ్నలు. ఎవరి దగ్గరా సరైన జవాబుల్లేవు. జరిగిందేమిటో తెలుసుకునే వ్యవధి లేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకునే శక్తి కూడా లేనంత దిగ్భ్రాంతిలో మునిగిపోయారు.

* * *

గాంధీ ఆస్పత్రి వైద్యులు జార్జిని పరీక్షించగానే నిర్ధారించారు, అతడు అప్పటికే మరణించాడని. పోస్ట్‌మార్టమ్ కోసమని దేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

జార్జ్‌పై దాడి జరిగిన వార్త నగరమంతా వ్యాపించింది. వివిధ కాలేజీల నుండి, ఉస్మానియా యూనివర్సిటీ నుండి విద్యార్థులు గాంధీ ఆస్పత్రికీ, అక్కడి నుండి ఉస్మానియా ఆస్పత్రికీ వెల్లువెత్తారు. జరిగిన దాడిని గురించి వివరాలు వెల్లడవుతున్న కొద్దీ ఆగ్రహంతో రగిలిపోయారు.

విద్యార్థుల ఆగ్రహావేశాలు చూసిన పోలీసులు అప్రమత్తమయ్యారు. అర్థరాత్రి దాటేవరకూ పోస్ట్‌మార్టమ్ నిర్వహించకూడదని డాక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. జార్జిని వెంటనే తమకు చూపించాలంటూ పోలీసులతో ఘర్షణకు దిగారు విద్యార్థులు. వాళ్ళను ఆస్పత్రిలోకి ప్రవేశించనివ్వకుండా చూసేందుకు భారీ పోలీసు బలగాలు మోహరించాయి.

విద్యార్థులు మరింతగా రెచ్చిపోయారు. కోపోద్రిక్తులైన యువకులు పోలీసు అధికారులపై కలబడి, వాళ్ళ బాడ్జీలనూ, టోపీలనూ లాగిపారేశారు. అతి కష్టంపై పోలీసులు ఆస్పత్రి ఆవరణను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు.

జార్జిరెడ్డి అమర్ రహే!

పోలీసు – ఆరెస్సెస్ కూటమిని తిప్పికొడదాం!

ఉస్మానియా ఆస్పత్రి పరిసరాలు నినాదాలతో హోరెత్తాయి.

నిండా పాతికేళ్ళు లేని ఓ యువకుడు... కేరళలో పుట్టి, తమిళనాడులో పెరిగి, కుటుంబ పరిస్థితుల ఆటుపోట్లతో ఎన్నో మజిలీలు దాటి, జీవితాన్ని వెదుక్కుంటూ తెలుగు నేలపై అడుగుపెట్టినవాడు... కేవలం పదేళ్ళ వ్యవధిలో హైదరాబాద్ నగరానికీ, ఇక్కడి ప్రగతిశీల యువతరానికీ ఇంత సన్నిహితుడవటానికి కారణమేమిటి? ప్రపంచ విప్లవోద్యమాల స్ఫూర్తిని ఈ విద్యార్థులకు అందించటంలోనూ, భవిష్యత్‌లో సంఘటితం కాబోతున్న విద్యార్థి ఉద్యమాలకు విప్లవ చైతన్యాన్ని అందించటంలోనూ అతడు నిర్వహించిన పాత్ర ఎటువంటిది? ఏ జీవితానుభవాల అధ్యయనంతో, ఏ భావజాలాల ప్రభావంతో అతడు తనసుతాను నిర్మించుకున్నాడు?

# 2

1962 లో హైదరాబాద్ నగరంతో జార్జికి తొలి పరిచయం. అప్పుడతనికి పదిహేనేళ్ళు.

హిమాయత్ నగర్ లోని సెంట్‌పాల్స్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థిగా అడుగుపెట్టిన జార్జి స్మృతులను అపురూపంగా పదిలపరచుకున్న వ్యక్తులు మర్రి అర్జున్ పటేల్ (1947–2012), రామనాథ్ అయ్యర్. వాళ్ళిద్దరూ ఆ స్కూల్లో అతని క్లాస్‌మేట్స్. జార్జి తమ్ముడు సిరిల్ కూడా అదే స్కూల్లో ఎనిమిదవ తరగతిలో చేరాడు. ఆనాటి హైదరాబాద్ వాతావరణమూ, స్కూల్లో తమ అనుభవాలూ సిరిల్‌కు కూడా బాగా జ్ఞాపకమే.

సెంట్‌పాల్స్ హైస్కూలు మిషనరీ స్కూలే అయినా పిల్లలందరూ హైదరాబాద్ హిందీ లోనూ, దక్కనీ ఉర్దూలోనూ మాట్లాడుకునే వాళ్ళు. జార్జికీ, సిరిల్‌కూ ఇంగ్లిష్, మలయాళం తప్ప, ఈ భాషలేవీ రావు. విద్యాబోధన ఇంగ్లిష్ మీడియంలోనే కాబట్టి అంతవరకూ సమస్యేమీ లేదు. కానీ తోటి పిల్లలతో స్నేహం కుదరటమే ఇబ్బందిగా ఉంది.

నిజానికి, వాళ్ళకీసమస్య ఏడాది కిందట మద్రాసు నుండి వరంగల్‌కు వచ్చినప్పుడే మొదలయింది. కేరళ, బెంగుళూరు, మద్రాస్ మిషనరీ స్కూళ్ళలో చదువుకున్న జార్జికీ, సిరిల్‌కూ ఆంధ్రప్రదేశ్‌కు రావటమే ఒక వింత అనుభవం. అందులోనూ వరంగల్ లాంటి చిన్న పట్టణంలో, తమకు పరిచయం లేని తెలుగుభాష మాట్లాడే మనుషుల నడుమ ఎలా మెలగాలో వాళ్ళకు అంతుబట్టలేదు.

మద్రాసులోని ఎగ్మూర్ డాన్‌బాస్కో స్కూల్లో చదువుతున్న తన కొడుకులు జార్జి, సిరిల్; కూతుళ్ళు డాన్, లావణ్య–అందరినీ వెంటబెట్టుకొని వాళ్ళమ్మ లీల హఠాత్తుగా వరంగల్‌కు బయల్దేరింది.

వరంగల్‌లో ఇల్లు చూడటానికి పెద్ద కొడుకు కార్ల్‌రెడ్డిని ముందుగా పంపిందామె. అతడు హనుమకొండలో ఓ ఇంటిని అద్దెకు మాట్లాడాడు. తీరా వచ్చి చూశాక ఆమెకు ఆ ఇల్లు నచ్చలేదు. తానే కాజీపేటలో ఓ ఇల్లు వెదికి, మకాం మార్చేసింది. జార్జినీ, సిరిల్‌నూ సెంట్ గాబ్రియెల్ స్కూల్లోనూ, చిన్న కూతురు లావణ్యను ఫాతిమా గర్ల్స్ స్కూల్లోనూ చేర్చింది. పెద్ద కూతురు డాన్‌తో బాటు తను కూడా ఫాతిమా స్కూల్లో టీచరుగా చేరింది లీల.

సెంట్ గాబ్రియేల్ స్కూల్లో చేరటంతోనే జార్జికూ, సిరిల్‌కూ ఇబ్బందులు మొదలయ్యాయి.

అంతదాకా మద్రాసులో వాళ్ళు చదువుతున్న డాన్‌బాస్కో ఆ నగరంలోని పేరున్న స్కూళ్ళలో ఒకటి. విద్యావంతులైన సంపన్నవర్గాల పిల్లలే అందులో ఎక్కువగా ఉండేవాళ్ళు. క్లాసుల్లో బోధన, పిల్లల సంభాషణలూ అంతా ఇంగ్లిష్‌లోనే సాగుతుండేవి.

వరంగల్‌లో పరిస్థితి మరొకరకం. అది ఇంగ్లిష్ మీడియం స్కూలే అయినా పిల్లలంతా తెలుగులోనూ, హిందీలోనూ మాట్లాడుకుంటున్నారు. ఆ భాషలేవీ రాకపోవటం అన్నదమ్ములిద్దరికీ పెద్ద సమస్యగా మారింది.

మద్రాసులోలాగా షార్ట్స్ తొడుక్కుని బూట్లూ, సాక్సూ వేసుకొని వెళ్తే ఈ స్కూల్లో అందరూ నవ్వుతున్నారు. ఇక్కడందరూ పొడవాటి లాగులే వేసుకుంటున్నారు.

మద్రాసులో చదువుతోబాటు ఎన్నో రకాలు ఆటపాటలు ఉండేవి. క్లాసులయిపోయాక స్కూల్లో పిల్లలంతా కలిసి క్రికెట్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్ ఆడేవారు.

అడయార్‌లోని ఇంటినుండి ఎగ్మూర్ దాకా రోజూ సిటీ బస్సులో స్కూలుకు వెళ్ళటం సరదాగా ఉండేది. పరిగెత్తుకెళ్ళి బస్సుల్ని అందుకోవటం, నడుస్తున్న బస్సులోంచి స్టేజి దగ్గర దూకెయ్యటం లాంటి సాహస కృత్యాలుండేవి. ఇక్కడ అలాంటి వాటికి చోటులేదు. చదువుతప్ప మరో వ్యాపకమే లేక, రోజులు చప్పగా గడుస్తున్నాయి.

ఈ జీవితానికి కొద్ది కొద్దిగా అలవాటు పడుతుండగానే ఆ మరుసటి ఏడాదే హైదరాబాద్‌కు కుటుంబాన్ని తరలించింది అమ్మ.

వరంగల్‌తో పోల్చుకుంటే హైదరాబాద్ పెద్ద నగరమే. కానీ మద్రాసులాగా ఆధునికమైన నగరం కాదు. సెంట్‌పాల్స్ హైస్కూల్లో కూడా భాషా సమస్యే ప్రధానమై కూర్చుంది.

"జార్జికి మేం మాట్లాడే ఏ భాషా రాదు. ఇంగ్లిష్ ధారాళంగా మాట్లాడేవాడు. కానీ, అది మలయాళీ యాసతో గమ్మత్తుగా ఉండేది. అతడు మాట్లాడుతుంటే మాకందరికీ నవ్వులాటగా తోచేది" అని చెప్పాడు అర్జున్ పటేల్.

పిల్లలందరూ తనను ఎగతాళి చేస్తుంటే జార్జికి ఉక్రోషం ముంచుకొచ్చేది. ఇది కొందరు పిల్లలకు మరింత వినోదంగా తయారయింది. ఓ కుర్రాడయితే వీలు దొరికినప్పుడల్లా హిందీలోనూ, ఉర్దూలోనూ బూతులు తిట్టసాగాడు.

ఇదంతా జార్జికి అర్థమవుతూనే ఉంది. ఇలాంటి వాళ్ళకు గట్టిగా జవాబు చెప్పాలంటే వెంటనే ఆ భాషలు నేర్చుకోవాలని నిశ్చయించుకున్నారు. ఎంత పట్టుదలగా దాన్ని కొనసాగించాడంటే – రెండు మూడు నెలల్లో ధారాళంగా హిందీ మాట్లాడ్డమే కాదు, ఎచ్ఎస్‌సి పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో అత్యధిక మార్కులు అతనికే!

జార్జి తెలివితేటలు, చురుకుతనం స్కూలు పిల్లలనూ, టీచర్లనూ ఆకర్షించసాగింది. చాలామంది స్నేహితులయ్యారు. అర్జున్ పటేల్, రామనాథ్ అయ్యర్ మరింత ఆత్మీయులు. చదువులో ప్రతిభావంతుడైన విద్యార్థిగానే కాదు, విలక్షణమైన వ్యక్తిత్వంతో కూడా జార్జి వాళ్ళను ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా అతని ప్రవర్తనలో వ్యక్తమయ్యే పట్టుదలనూ, నిర్భీతినీ చూసి వాళ్ళు ఆశ్చర్యపడ్డారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jeena+Haito+Marna+Seekho**

* * *